సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 15 । జూలై । 2023



రాజన్న సేవలో రిటైర్డ్ అడిషనల్ డీజీ

వేములవాడ: రిటైర్డ్ అడిషనల్ డీజీ ఉమేశ్ శ్రాఫ్ శుక్రవారం రాజన్నను దర్శించుకున్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్ స్వాగతం పలికారు.



ఈజీఎస్ పనులపై గ్రామసభ

వేములవాడరూరల్: ఎదురుగట్లలో గత రెండేళ్లుగా చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనుల వివరాలు నమోదు చేసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

వంగిన ప్రమాదం

- పంట పొలాల్లో శిథిలావస్థకు చేరిన కరెంట్‌పోల్స్
- రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని సెస్ అధికారులు



పంట పొలంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



ఈ చిత్రంలోని వంగిన విద్యుత్‌స్తంభం ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని వంగల లక్ష్మారెడ్డి పంట పొలంలోది. భయం.. భయంగా పొలం దున్నుతున్నాడు. పొలం దున్నేటప్పుడు, పంట కోసే సమయంలో ట్రాక్టర్ ఎక్కడ తాకి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నాడు.



ఇది ఎల్లారెడ్డిపేటలోని వ్యవసాయ పొలాల్లోని శిథిలావస్థకు చేరిన పాత స్తంభం. ఎప్పుడు కూలుతుందో తెలియని ఇలాంటి స్తంభాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి స్తంభాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సమాచారం ఇలా..

శిథిలావస్థకు చేరిన స్తంభాలు	2,700
వంగిన స్తంభాలు	1,076
మాయమైన స్తంభాలు	10,800

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): లూజ్ వైర్లు.. వంగిన విద్యుత్‌స్తంభాలు.. చేతుకందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలుతాయో తెలియక రైతులు భయం.. భయంగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. బురదలో ఉండే స్తంభంతో కరెంట్‌షాక్ తగలకుండా జాగ్రత్త చర్యలు కూడా సెస్ అధికారులు తీసుకోవడం లేదు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా వంగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో ప్రాణనష్టం జరుగుతున్నా వీటిని సవరించే పనులు మాత్రం చేయడం లేదు.

శిథిలావస్థకు చేరిన స్తంభాలు

జిల్లాలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) ద్వారా కరెంట్ సరఫరా అవుతోంది. సెస్ పరిధిలో 3,700 స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. 1076 కరెంట్‌పోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. గత పాలకవర్గంలో 10,800 విద్యుత్ స్తంభాలను సిబ్బంది ఎక్కడ వేశారో తెలియడం లేదు. వీటిపై ప్రస్తుతం పాలకవర్గం విచారణ చేపట్టింది. ఇందుకు ఇద్దరు అధికారులను ఇప్పటికే నియమించింది.

భయంనీడలో అన్నదాతలు

పంట పొలాల్లో వంగి, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలతోనే కరెంట్ సరఫరా జరుగుతోంది. నిత్యం పొలాల్లో పనిచేసే రైతులు భయం.. భయంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనులు చేస్తున్నారు. పంటపొలాల మధ్యలో ఉన్న స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కొన్ని గ్రామాల్లో కరెంట్‌తీగలు ఇళ్లను తాకుతూ వెళ్తున్నాయి. గతంలో ప్రమాదాలు జరిగి పలువురు మరణించారు. అయినా అధికారుల్లో స్పందన రావడం లేదు.

ప్రాణాలు పోతున్నాయి



గ్రామాల్లో లూజ్ వైర్లు, వంగిన, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలతో ప్రాణాలు పోతున్నాయి. వ్యవసాయ పనులు చేసే రైతులు, పాడిగేదెలు, ఎడ్లు అనేక సార్లు ప్రమాదాలకు గురై మృతిచెందాయి. చాలా గ్రామాల్లో లూజ్‌వైర్లు ఇళ్లను తాకుతున్నాయి.

– దడిగెల పర్శరాంరెడ్డి, బండలింగంపల్లి

సమస్యలు పరిష్కరిస్తాం



పంట పొలాల్లో వంగిన, శిథిలావస్థకు చేరిన కరెంట్‌పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. గతంలో జిల్లాలో 10,800 స్తంభాలను మంజూరు చేశాం. వాటిని ఎక్కడెక్కడ వేశారో ఆరా తీస్తున్నాం. మంత్రి కేటీఆర్, రైతులు, వినియోగదారుల సహకారంతో సంస్థను అభివృద్ధి చేస్తాం.

– చిక్కాల రామారావు, సెస్ చైర్మన్

ఎన్నికల బదిలీలు షురూ!

- పెద్దపల్లి కలెక్టర్‌గా ముజమ్మిల్ ఖాన్
- కరీంనగర్ జెడ్పీ సీఈవోకు పెద్దపల్లి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు
- సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా గరిమా బదిలీ



ఆనంద్‌కుమార్



శ్రీనివాస్‌రావు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్ /సిరిసిల్ల : సార్వత్రిక ఎన్నికల క్రమంలో బదిలీల వేగం పుంజుకుంది. ఇటీవల డీఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం శుక్రవారం అదనపు కలెక్టర్లను బదిలీ చేయగా కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు పదోన్నతి కల్పిస్తూ అదనపు కలెక్టర్లుగా నియమించింది. అలాగే ఆర్డీవోలకు సైతం స్థానచలనం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో పలువురు అదనపు కలెక్టర్లను బదిలీ చేయగా నేడు, రేపు కూడా మరిన్ని బదిలీలు జరిగే అవకాశముందని సమాచారం.

- సిద్దిపేట అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) ముజమ్మిల్‌ఖాన్‌ను పెద్దపల్లి కలెక్టర్‌గా నియమించగా పెద్దపల్లి కలెక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణను టీఎస్ ఫుడ్స్ ఎండీగా నియమించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) దివాకర్‌ను జగిత్యాల అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించగా అదనపు కలెక్టర్ మంద మకరంద్‌ను నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.
- పెద్దపల్లి అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) కుమార్ దీపక్‌ను నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేయగా అతనిస్థానంలో కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సతీమణి కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకను నియమించారు.
- వెయిటింగ్‌లో ఉన్న జల్ద అరుణశ్రీని కరీంనగర్ అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించారు. ఈమె గతంలో కరీంనగర్ డీఆర్డీవోగా విధులు నిర్వహించారు.
- కరీంనగర్ జాయింట్ కలెక్టర్(ట్రైనీ) నవీన్ నికోలస్‌ను తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ సెక్రటరీగా నియమించారు.
- కరీంనగర్ అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) గరిమా అగర్వాల్‌ను సిద్దిపేట అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించారు.
- కరీంనగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ఉన్న శ్యాం ప్రసాద్‌లాల్‌ను పెద్దపల్లి అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీఅయ్యారు. శ్యాంప్రసాద్ లాల్ స్థానంలో సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కె.లక్ష్మీకిరణ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

జనవరిలోనే చెప్పిన సాక్షి

సీపీ సత్యనారాయణ, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ బదిలీ అవుతారని, అలాగే గతంలో జెడ్పీ సీఈవోగా ఉన్న ప్రియాంకకు ఐఏఎస్ హోదా రానుందని, ఆ వెంటనే బదిలీ కూడా అవుతారని 'సాక్షి' ఈ ఏడాది జనవరి 3న కథనం ప్రచురించింది. ఆ కథనం ప్రకారమే ఈ ముగ్గురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు.

ఆర్డీవోలు సైతం

ప్రస్తుతం ఉట్నూరు ఆర్డీవోగా ఉన్న కె.మహేశ్వర్‌ను కరీంనగర్ ఆర్డీవోగా నియమించారు. కరీంనగర్ ఆర్డీవోగా ఉన్న ఎస్.ఆనంద్‌కుమార్‌ను సిరిసిల్లకు బదిలీచేశారు. సిరిసిల్ల ఆర్డీవోగా ఉన్న టి. శ్రీనివాసరావు డిప్యూటీ కలెక్టర్ అండ్ తహసీల్దార్ శేరిలింగంపల్లికి బదిలీపై వెళ్లనున్నారు. ప్రస్తుతం జగిత్యాల ఆర్డీవోగా ఉన్న మాధురిని సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా పంపారు.

సివిల్స్–2016లో తెలంగాణ టాపర్

ముజమ్మిల్‌ఖాన్ 2014లో తొలిసారిగా సివిల్స్ రాస్తే ఐఆర్‌టీఎస్ వచ్చింది. శిక్షణ పూర్తయ్యాక ఏసీఎంగా కొలువు దక్కింది. 2015లో మళ్లీ సివిల్స్ రాయగా ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. అందులో చేరకుండా పాత ఉద్యోగంలోనే కొనసాగుతూ మూడోసారి 2016లో సివిల్స్ రాయగా జాతీయస్థాయిలో 22వ, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. ఐఏఎస్ శిక్షణ పూర్తి చేశాక 2018లో వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్, హుస్నాబాద్ డిప్యూటీ కలెక్టర్ పని చేశారు. ఫిబ్రవరి 2020లో సిద్దిపేట జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. శుక్రవారం పెద్దపల్లి కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈయన మాజీ సీనియర్ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ కుమారుడు కావడం గమనార్హం.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- ఘనంగా జిల్లా స్థాయి యువోత్సవ్



స్టాల్స్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, దేశం గర్వించేలా ఎదగాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలోని రైతువేదికలో నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌కు హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక యువత గల దేశం మనదన్నారు. లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకెళ్తే సాధించవచ్చన్నారు. దాదాపు 300పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా నెహ్రూ యువజన అధికారి వెంకట్ రాంబాబు, డీపీఆర్వో మామిండ్ల దశరథం, జిల్లా క్రీడల అధికారి అజ్మీరా రాందాస్, నేషనల్ యూత్ అవార్డు గ్రహీత రవి పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

- ఒకరికి ఉత్తమ సేవా పతకం
- మరో నలుగురికి సేవా పతకాలు



విశ్వప్రసాద్ డీఎస్పీ



రవికుమార్ ఎస్బీ డీఎస్పీ



శ్రీనివాస్ హెడ్‌కానిస్టేబుల్

సిరిసిల్లక్రైం: రాష్ట్ర పోలీసుశాఖ శుక్రవారం ప్రకటించిన పలు పతకాలలో జిల్లా పోలీసు అధికారులతోపాటు పోలీసు సిబ్బందికి పతకాలు లభించాయి. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పుల్కం శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా పతకం లభించింది. సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రవికుమార్‌తోపాటు ఏఆర్‌ఎస్‌ఐ మహ్మద్ శబీర్ హమ్మద్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ వి.లక్ష్మీనారాయణ సేవా పతకాలకు ఎంపికైన వారిలో ఉన్నారు. ఉత్తమ సేవపతక గ్రహీతకు రూ.30 వేల నగదు, సేవపతక గ్రహీతలకు రూ.20వేల నగదు పారితోషికం అందించనున్నట్లు ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్ శుక్రవారం వెల్లడించిన ఉత్తర్వుల్లో ఉంది.

అడ్‌హక్ కమిటీ సమావేశం రసాభాస

- మత్స్య సహకార అడ్‌హక్ ఎన్నిక గందరగోళం
- నిరసనలతో హోరెత్తిన మీటింగ్
- జిల్లా చీఫ్ ప్రమోటర్‌గా రామచంద్రం



కలెక్టరేట్‌లో నేలపై బైఠాయించి నిరసన తెలుపుతున్న యామ తిరుపతి వర్గం సభ్యులు



ప్రమోటర్లుగా ఎన్నికైన సభ్యులు



చొప్పరి రామచంద్రం

సిరిసిల్ల: జిల్లా మత్స్య సహకార సంఘం రిజిస్ట్రేషన్ కోసం శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం రసాబాసగా మారింది. జిల్లా కమిటీలో భాగంగా అడ్‌హక్ కమిటీ ఎన్నికలు నిర్వహించగా.. అధికార పార్టీ నేతల జోక్యంతో గందరగోళం ఏర్పడింది. ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 20 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు. అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు నేతలు ఎవరికి వారే తమ పంతాన్ని నెగ్గించుకునేందుకు పట్టుదలకుపోవడంతో అడ్‌హక్ కమిటీ ఎన్నిక అయోమయంగా సాగింది.

నిరసనలు.. బైఠాయింపులు

జిల్లాలో 116 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా.. 113 మంది సభ్యులు హాజరయ్యారు. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ సంఘాలు కొనసాగగా, ఇప్పుడు కొత్తగా రాజన్నసిరిసిల్ల జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశానికి సంఘాల అధ్యక్షులను అనుమతించారు. తంగళ్లపల్లి మండలం సారంపల్లి అధ్యక్షుడిని తొలగించగా.. మళ్లీ అతన్నే సమావేశానికి అనుమతించారని నిరసన తెలిపారు. అంకుసాపూర్‌కు చెందిన వారిని ఇలాగే సభకు అనుమతించారని యామ తిరుపతి ఆరోపించారు. ప్రస్తుతం సమావేశం వాయిదా వేయాలని, మళ్లీ నోటీసులు నిర్వహించాలని కోరుతూ వేదిక ముందు బైఠాయించారు. సహకార నిబంధనల ప్రకారం అందరికీ సమాచారం ఇచ్చామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. మరోవర్గం చొప్పరి రామచంద్రం నేతృత్వంలో ఇప్పుడే ఎన్నికలు నిర్వహించాలని అక్కడే కూర్చున్నారు.

గందరగోళం మధ్యే ఎన్నిక

వాదనలు, దూషణల మధ్య ఎన్నికల ప్రక్రియను జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ ప్రారంభించారు. చేతులు ఎత్తే విధానంలో 61 మంది సభ్యుల ఆమోదంతో జిల్లా కమిటీ చీఫ్ ప్రమోటర్‌గా చొప్పరి రామచంద్రం ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రమోటర్లుగా గాడిచర్ల శ్రీనివాస్, ఉత్తెం శ్రీనివాస్, పిట్టల బాబు, పెంద్యాల శంకర్, రేగుల రాజేశం, బొజ్జ లక్ష్మీరాజం, గాడిచర్ల దేవయ్య, పిట్టల మోహన్, రేగుల అనిల్‌కుమార్, ఫణి శివరామకృష్ణ ఎన్నికయ్యారు. మెజార్టీ సభ్యులు ఆమోదం తెలపడంతో ఎన్నిక జరిగినట్లు అధికారులు ప్రకటించారు.

ఎన్నిక చెల్లదని రాస్తారోకో

ఎన్నికలు వాయిదా వేయాలని కోరుతూ యామ తిరుపతి వర్గం అక్కడే బైఠాయించగా.. వారిని పోలీసులు బలవంతంగా బయటకు లాగేశారు. యామ తిరుపతిని రెండు సార్లు పోలీసులు బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. దీంతో నిరసన తెలుపుతూ సిరిసిల్ల–వేములవాడ రహదారిపై బైఠాయించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్న వారిని శాంతింపజేశారు. సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కిరణ్‌కుమార్, ఉపేందర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, తిరుపతి, చీనానాయక్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ ఎన్నికలపై ఇంటలీజెన్సీ అధికారులు ఆరా తీశారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ నేతల జోక్యం ప్రధానంగా చర్చనీయాంశమైంది.

బోనాల వైభవం

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన బోనాల ఊరేగింపు వైభవంగా జరిగింది. బీవైనగర్‌లోని పోచమ్మ ఆలయం నుంచి పాత పోచమ్మ గుడి వరకు సాగిన ఊరేగింపు ఆకట్టుకుంది. హిందూ సాంస్కృతిక సమితి సారథ్యంలో చేపట్టిన శోభాయాత్రలో భారీగా ప్రజలు పాల్గొన్నారు. ఊరేగింపులో అమ్మవారి వివిధ ప్రతిరూపాలను ప్రదర్శించారు.



ఆకట్టుకున్న అమ్మవారి ప్రతిరూపం



బోనాలకు హాజరైన ప్రజాప్రతినిధులు, పట్టణవాసులు

న్యూస్‌రీల్

దళితులు ఆర్థికంగా ఎదగాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి షరతులు లేకుండా వంద శాతం సబ్సిడీపై ఇచ్చే రూ.50వేల సాయంతో దళితులు ఆర్థికంగా ఎదగాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆకాంక్షించారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో శుక్రవారం 20 మందికి రూ.50వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఆగయ్య మాట్లాడుతూ నిరుపేద దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో వంద శాతం సబ్సిడీపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, నాయకులు చాంద్‌పాషా, నర్సింహారెడ్డి, అందె సుభాష్, బాల్‌రెడ్డి, సల్మాన్, ఉదయ్, సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి




సిరిసిల్లఅర్బన్: ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో 8 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, ప్రమాదబీమా వర్తింపజేయాలని, గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. 55 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ.5వేలు పెన్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, కదారి రాములు, మంత్రి చంద్రయ్య, జిల్లా కో–కన్వీనర్ నడిగొట్టు లక్ష్మి, ఎల్లవ్వ ఉన్నారు.

'దళితులను మోసం చేస్తున్న కేసీఆర్'



ఇల్లంతకుంట(మానకొండూర్): ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు మూడేకరాల భూమి ఇస్తానని మోసం చేశారని.. ఇప్పుడు దళిత బంధు పేరుతో ఆశలు రేపుతున్నారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ విమర్శించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ఇళ్లులేని నిరుపేద దళితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, డప్పు కొట్టుకునే వారికి రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు సంతోష్, హరీశ్, తిరుపతి, ఎల్లయ్య, మహేశ్, ప్రశాంత్, ముత్తక్క, శ్రీనివాస్, సాయగౌడ్ ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని జైసేవాలాల్ భూక్యారెడ్డితండా(వట్టిమల్ల)కు చెందిన బానోత్ ఇల్లు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానిక సర్పంచ్ లకావత్ ప్రమీలతిరుపతి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. తండా పెద్దమనుషులు బానోత్ జగ్నానాయక్, నారాయణ, రాములు ఉన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శకుంతల ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ 16, బైపీసీ 6, ఒకేషనల్ కోర్సు (ఏ అండ్ టీ) 18 సీట్లు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారు మెమో, టీసీ, కులం, ఆదాయం, ఆధార్‌తోపాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈనెల 18న కళాశాలలో హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

గూడు రాలేదని గుండె ఆగింది



ఆస్పత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఈర్ల రాజు(ఫైల్)

సిరిసిల్లటౌన్/క్రైం: సొంతింటి కోసం తొమ్మిదేళ్లుగా ఎదురుచూసిన నిరుపేద గుండె ఆగిపోయింది. డబుల్ బెడ్‌రూమ్ ఇంట్లో దర్జాగా బతకవచ్చనుకున్న దర్జీ శ్వాస ఆగింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్‌కు చెందిన ఈర్ల రాజు(48) దర్జీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ప్రభుత్వం అందించే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. డబుల్ బెడ్‌రూమ్ జాబితాలో పేరు వచ్చిన లక్కీడ్రాలో ఇల్లు రాకపోవడంతో తీవ్ర మనోవేదకు గురయ్యాడు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, కలెక్టర్ కార్యాలయంలో ఇల్లు కోసం విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. సొంతింటి కల నెరవేరదనే బెంగతో మనోవేదనకు గురై శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రాజుకు భార్య శారద, డిగ్రీ చదువుతున్న కుమారుడు శివవర్ధన్ ఉన్నారు.

17 నుంచి అధిక మాస ప్రబోధ కార్యక్రమాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో ఈనెల 17 నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసం సందర్భంగా ప్రబోధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి తెలిపారు. సత్సంగ సదనం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ సరస్వతీ గోవిందా రాజుల ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగిత్యాల నంబి వేణుగోపాలచార్య ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. రాచర్లగొల్లపల్లికి చెందిన రాచర్ల రఘురాం శర్మ మార్కండేయ పురాణ ప్రవచనాలు వినిపిస్తారని తెలిపారు. ఆగస్టు 8 నుంచి 16 వరకు హైదరాబాద్‌కు చెందిన త్రిగుళ్ల నరసింహమూర్తిశర్మ పద్మ పురాణ ప్రవచనాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమాలు పూర్తయ్యే వరకు భక్తులకు నివాస వసతి కల్పించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. వేములవాడ రూరల్‌లో అత్యధికంగా 18.9 మిల్లీమీటర్ల వర్షం పడగా.. ఎల్లారెడ్డిపేటలో చుక్క వాన పడలేదు. రుద్రంగిలో 1.7, చందుర్తిలో 6.5, బోయినపల్లిలో 5.6, వేములవాడలో 7.3, సిరిసిల్లలో 16.3, కోనరావుపేటలో 1.7, వీర్నపల్లిలో 7.5, గంభీరావుపేటలో 1.9, ముస్తాబాద్‌లో 6.8, తంగళ్లపల్లిలో 14.7, ఇల్లంతకుంటలో 1.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 35 శాతం లోటువర్షపాతం ఉంది.

పేదల కల సాకారం

- నిరుపేద ముస్లింలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేత
- త్వరలోనే ముంపు గ్రామ సమస్యలు పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు



ఇళ్లస్థలాల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు

వేములవాడ అర్బన్: రెక్కాడితే కానీ పూట గడవని కుటుంబాలు.. ఇన్నాళ్లు ఇళ్లస్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇరవై ఏళ్లనాటి కల నేడు సాకారం కానుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు అందించేందుకు అధికారులు సర్వే చేపట్టగా ఇన్ని రోజులకు ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇళ్ల పట్టాలు అందజేశారు.

వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి ఐదో వార్డులోని ఇస్లాంనగర్ ముస్లింలకు ప్రభుత్వ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు శుక్రవారం అందజేశారు. నాంపల్లిలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా నిరుపేదలైన ఇస్లాంనగర్ ముస్లింలకు పట్టాలు అందించాలని అనుకున్నా వారి కల ఇప్పుడు నెరవేరిందన్నారు. సంకెపల్లిలో ఇదివరకే పట్టాలు అందించామని, మిగిలిన 45 ఇళ్లకు త్వరలోనే నష్ట పరిహారం అందిస్తామన్నారు. గ్రామంలో పది ఇళ్ల పట్టాలు అందిస్తున్నామన్నారు. నాంపల్లి శివారులోని రైల్వే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, ఆర్డీవో పవన్ కుమార్, తహసీల్దార్ రాజు, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, ఆర్‌సీ రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించిన ఇళ్లకు పట్టాలు..

ఇస్లాంనగర్‌లో గతంలో ఏళ్లక్రితం ప్రభుత్వం స్థలంలో ముస్లింలు గుడిసెలు, చిన్న ఇళ్లు నిర్మాణం చేసుకొని స్థలాన్ని ఆపారు. వాటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి ఎవరికి ఎంత స్థలంలో ఇళ్లు, పూరి గుడిసెలు వేసుకున్నారో సర్వేలు చేసి వారి పేరు మీద ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు.

నాంపల్లి ఐదో వార్డులో 106 మందికి..

మున్సిపల్ పరిధి నాంపల్లి ఐదో వార్డులోని ఇస్లాంనగర్ ముస్లిం నిరుపేదలకు 106 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. వేములవాడ మండలం సంకెపల్లి ముంపు గ్రామ నిర్వాసితులకు పది మందికి ఇళ్ల స్థలాల పట్టాలను కూడా అందజేశారు.

సంతోషంగా ఉంది



ఇల్లు నిర్మించినా ఎలాంటి పట్టాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉండేది. ప్రభుత్వం ఎప్పుడు తీసుకుంటుందో అనే బాధ ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఇళ్ల స్థలం పట్టా అందించడం ఆనందంగా ఉంది.

– సయ్యద్ అలీబీ ఇస్లాంనగర్

ఇన్నాళ్లకు వచ్చాయి



ఎప్పటినుంచో నిర్మించుకున్న ఇల్లు ప్రభుత్వం స్థలం కావడంతో ప్రభుత్వం పట్టాలు ఇస్తే బాగుండు అనుకున్నాం. దీనిపై ఎమ్మెల్యే రమేశ్ బాబు దృష్టికి తీసుకువెళ్లాం. ఈరోజు కల సాకారమైంది. పట్టాలు అందించారు..

– షేక్ అలీ. ఇస్లాంనగర్

పట్టాలు అందించారు



ప్రభుత్వం నిరుపేదలను గుర్తించడం లేదని ఇన్నాళ్లు బాధగా ఉండేది. ప్రభుత్వం, అధికారులు గుర్తించి తాము నిర్మాణం చేసుకున్న స్థలాన్ని సర్వే చేసి పట్టాలు అందించారు. చాలా ఆనందంగా ఉంది.

– షేక్ గోరబీ ఇస్లాంనగర్

పోతుగల్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ



లబ్ధిదారులతో సర్పంచ్, అధికారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందజేస్తుందని సర్పంచ్ తన్నీరు గౌతంరావు అన్నారు. ముస్తాబాద్ మండలం... పోతుగల్‌లో 48 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారన్నారు. అర్హులందరికీ గ్రామసభ ద్వారా ఎంపికచేసిన వారికి తాళాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎవరైనా మిగిలి ఉంటే వారికి గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు, ఆర్‌ఐ శ్యామ్, ఉపసర్పంచ్ మంజుల, ఎంపీటీసీ బాలకిషన్, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, పారిపెల్లి శ్రీనివాస్, వెంకట్‌రావు, కృష్ణ, విశ్వనాథ్, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో రమేశ్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే కోడిగుడ్డు ధర పెంచాలని, లేదా ప్రభుత్వమే కోడి గుడ్లను సరఫరా చేయాలని ప్రభుత్వం ఒక్కో కోడిగుడ్డుకు రూ.4.50 పైసలు చెల్లిస్తుందన్నారు. కానీ మార్కెట్‌లో రూ.7 పెట్టి కొనడంతో మధ్యాహ్న భోజన కార్మికులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈనెల 17 నుంచి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కోడి గుడ్లను విద్యార్థులకు అందించబోమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకుల కోడం రమణ, తదితరులు ఉన్నారు.

సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలి



అగ్రహారంలో రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడఅర్బన్: రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు చేపడుతున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని జిల్లా టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాల ముందు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 16న గద్వాల జిల్లా జోగులాంబ, అలంపూర్ నుంచి ప్రారంభంకానున్న రథయాత్ర సిరిసిల్ల జిల్లాకు 26 వరకు చేరుకుంటుందన్నారు. ఈ రథయాత్రకు జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, నీలం సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు



సమావేశంలో మాట్లాడుతున్న కడారి రాములు

వేములవాడఅర్బన్: పట్టణంలో ఏడేళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అభివృద్ధిలో అధికారుల నిర్లక్ష్యం ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. శుక్రవారం వేములవాడలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో మురుగుకాలువలు లేక నీరంతా రోడ్డుపై పారుతోందన్నారు. నాలుగేళ్లుగా వేములవాడ మూలవాగు బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని, ఎప్పుడు పూర్తిదశకు చేరుకుంటాయోనన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లా దేవరాజు, క్రాంతి, పోశెట్టి, దుర్గయ్య, దేవయ్య, తదితరులున్నారు.

రిలే దీక్షలు చేస్తే అరెస్టులా ?

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రం మహేశ్

వేములవాడఅర్బన్: మధ్యమానేరు ముంపుగ్రామాల సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్ష చేస్తే అరెస్టులు చేయిస్తారా అని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేశ్ అన్నారు. వేములవాడ నందికమాన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేములవాడలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో ఎమ్మెల్యే రమేశ్‌బాబు చెప్పాలన్నారు. ముంపు గ్రామాల సమస్యలు ఎమ్మెల్యే రమేశ్‌బాబు పరిష్కరించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, బుర్ర శేఖర్‌గౌడ్, మోహన్‌రావు, ముప్పిడి శ్రీనివాస్, రాజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అరుణ్, చారి, తదితరులున్నారు.

'అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మంత్రి కేటీఆర్ చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. పాలకవర్గంలోని కొందరు ప్రజాప్రతినిధుల బంధువులు అక్రమ నిర్మాణాలు చేపట్టినా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ పాలకవర్గాన్ని రద్దుచేసి మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కైలాష్‌కుమార్, నరేశ్, కొండ నరేశ్, అంజన్న, మోర శ్రీహరి, సదానందం, రమేశ్, మైసయ్య, కోడం శ్రీనివాస్, తదితరులున్నారు.

ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్

- బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు చేసేందేమీ లేదు
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చీటి ఉమేశ్‌రావు



మాట్లాడుతున్న చీటి ఉమేశ్‌రావు

సిరిసిల్లఅర్బన్: వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించి దేశానికి పరిచయం చేసింది కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ సీనియర్ నాయకుడు చీటి ఉమేశ్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ అందక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సిరిసిల్లలో పోలీసుల రాజ్యం నడుస్తుందని, ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను తట్టుకోలేకనే అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎడుమల భూపాల్‌రెడ్డి, ఒరుగంటి తిరుపతి, చుక్క శేఖర్, ఆసరి బాలరాజ్‌యాదవ్, మల్లేశ్‌బాబు, సర్వయ్య, భాను, తాజ్, మదన్, అజయ్, చంద్రయ్య ఉన్నారు.

దర్మావళికి సదర్ కందూర్



దర్మావళి దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న గౌడ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ శివారులోని దర్మావళి గుట్ట వద్ద శుక్రవారం వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ సదరు కందూర్ చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏటా సదరు కందూర్ చేయడం ఆనావాయితీగా వస్తోంది. గౌడ సంఘం సభ్యులు అల్లాకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంట శ్రీనివాస్ గౌడ్, సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వంటావార్పు



వంటావార్పులో పంచాయతీ కార్మికులు

గంభీరావుపేట: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. శుక్రవారం మండలకేంద్రంలో కార్మికులు వంటావార్పు నిర్వహించారు. ప్రధాన రహదారిపై సామూహిక భోజనాలు చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు చీటి ఉమేశ్‌రావు, మండలశాఖ అధ్యక్షుడు హమీద్, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, పత్తిస్వామి రాజ్ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు కుట్టు శిక్షణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల సభ్యులకు మూడునెలల పాటు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌ఏసీ జిల్లా ఇన్‌చార్జి జి.ప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ బీఈవాబ్ బోర్డులో నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులపై ఆధారపడిన వారికి శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఎల్లారెడ్డిపేటలోని స్వశక్తి భవన్‌లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులుంటే.. ఉపాధ్యాయులుండరు..!



ప్రాథమిక పాఠశాలలో హాజరైన ఇద్దరు విద్యార్థులు

వేములవాడరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇప్పటికీ విద్యాబోధన అందడం లేదు. పిల్లలు వచ్చినా ఉపాధ్యాయులు, కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు వచ్చినా విద్యార్థులు రావడం లేదు. అటెండర్లు, స్వీపర్లు, స్కావెంజర్లు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎదురుగట్ల ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వాహకులు రాక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక ఇద్దరితోనే ఉపాధ్యాయురాలు విద్యాబోధన అందిస్తోంది. పాఠశాలలో విద్యార్థులే బడిగంట కొడుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచినా ఇంకా నిర్వహణ మాత్రం అంతంతమాత్రంగానే ఉంది.



బడిగంట కొడుతున్న విద్యార్థి

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా గ్రామాల్లో, ఆవాస ప్రాంతాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు షెడ్యూల్డ్ సిద్ధం చేయాలన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వారీ వివరాల జాబితాను సిద్ధం చేయాలని అనురాగ్ జయంతి ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో తూచ తప్పకుండా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2023 సాధారణ ఎన్నికలపై సమీక్షించారు. ఓటర్ల జాబితా తయారీ, నమోదుపై మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతులను పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు. జూలై 28 నుంచి ఓటర్ల నమోదుపై స్విప్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, తహసీల్దార్లు విజయ్‌కుమార్, రాజు, ఎన్నికల డీటీ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ



రజనికాంత్



కుమారస్వామి

సిరిసిల్లక్రైం: జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీచేస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వి. కమలాసన్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో డిసెంబర్ 2017 నుంచి ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ముష్కె రజనికాంత్‌ను కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీచేయగా ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఐ వెనగంటి మధుకర్ విధులు కేటాయించారు. జూలై 2019 నుంచి ఆర్‌ఐగా విధుల్లో ఉన్న మండెపల్లి కుమారస్వామి నిజామాబాద్‌కు బదిలీ చేశారు.